క్లుప్తంగా

కార్మికుడి మృతిపై విచారణ జరిపించండి



వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

పెనుకొండ రూరల్: దళిత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలంటూ ఆర్డీఓ కార్యాలయంలో సీఐటీయూ నాయకులు శుక్రవారం వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. పరిగి మండలంలోని ఇండియన్ డిజైన్ గార్మెంట్స్‌లో శివకుమార్ ఆకస్మికంగా విధుల్లో మృతి చెందాడన్నారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి చనిపోవడంపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారన్నారు. పరిశ్రమలో సీసీ పుటేజీలను ఆధారంగా పరిశీలిస్తే నిజాలు తెలుస్తాయన్నారు. సంబంధితశాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. నాయకులు రమేష్, నాగరాజు, రాజు, మహబూబ్ బాషా, నాగప్ప, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



అధ్యక్షుడిగా ఎన్నికైన గంగాధర్

రొద్దం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్ ఆధ్వర్యంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నరేష్ చెప్పారు. గౌరవ అధ్యక్షుడిగా రమేష్, మండల అధ్యక్షుడిగా సానిపల్లి గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా కె. మారుతి, ఉపాధ్యక్షులుగా నాగార్జునరెడ్డి, ముత్యాలప్ప, కోశాధికారిగా ఎం నరేష్, కమిటీ కన్వీనర్‌గా శేషాద్రి తదితరులను ఎన్నుకున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 117 జీఓ రద్దు చేస్తామని చెప్పిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

కొటిపిలో ఉచిత వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

హిందూపురం: వాసవ్య మహిళా మండలి విప్రో కేర్స్ సహకారంతో తూమకుంట చెక్‌పోస్ట్ కుశల్ హెల్త్ కేర్ క్లినిక్ నిర్వాహకులు కొటిపి గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధులపై క్యాంప్ నిర్వహించారు. గైనకాలజిస్ట్ అనూష మాట్లాడుతూ వైద్య శిబిరానికి మంచి స్పందన లభించిందని, అవసరమైన వారికి ఉచితంగానే మందులు అందించామన్నారు.

జాతీయస్థాయి గ్రాప్లింగ్ పోటీల్లో ప్రతిభ



తృతీయ స్థానంలో నిలిచిన హితేష్ దత్త

హిందూపురం టౌన్: ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరిగిన జాతీయ స్థాయి గ్రాప్లింగ్ పోటీల్లో హిందూపురానికి చెందిన విద్యార్థి హితేష్ దత్త ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రాప్లింగ్ ఇన్‌స్ట్రక్టర్ చరణ్‌రాజ్ మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకూ హరిద్వార్‌లో జాతీయస్థాయి గ్రాప్లింగ్ పోటీలు జరిగాయన్నారు. హిందూపురం నుంచి ఎంసీ హితేష్ దత్త, శ్రీచరణ్, అర్షద్ పాల్గొన్నారని చెప్పారు. వారిలో ఎంసీ హితేష్ దత్త ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు.

పట్టు రైతుల సమస్యలు పరిష్కరించండి



కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న నాయకులు

మడకశిర: విజయవాడలో శుక్రవారం మడకశిర, హిందూపురం ప్రాంతాలకు చెందిన పట్టు రైతుల సంఘం నాయకులు పట్టు పరిశ్రమశాఖ కమిషనర్ శ్రీనివాస్‌ను కలిశారు. పట్టు రైతుల సంఘం నాయకులు సోమకుమార్, వెంకట్రామిరెడ్డి, నవీన్, సిద్ధారెడ్డి, హనుమంతరాయప్ప తదితరులు కమిషనర్‌ను కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు 50 వేల మంది బైవోల్టిన్ రైతులకు రూ.57 కోట్ల ప్రోత్సాహక ధనం మంజూరు కావాల్సి ఉందని, వెంటనే మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని కోరామన్నారు.

రేపు చండీహోమం

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 8 గంటలకు మహా చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

పడిపోతున్న ఉష్ణోగ్రతలు

- వేకువ జామున దట్టంగా కురుస్తున్న మంచు
- వాహనాల రాకపోకలకూ ఇబ్బంది
- చలి తీవ్రతతో వణుకుతున్న ప్రజలు

ఐదు రోజులుగా హిందూపురంలో ఉష్ణోగ్రతలు ఇలా

తేదీ	పగలు	రాత్రి
18	28	19
19	27	19
20	27	18
21	26	18
22	29	15



హిందూపురం: జాతీయ రహదారిపై పొగమంచు



హిందూపురం: తెల్లవారుజామున ఎంజీఎం మైదానంలో ఇలా..

హిందూపురం అర్బన్ : జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత మొదలైంది. దీనికి 15 నుంచి 20 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు చలికి వణికి పోతున్నారు. సాయంత్రం నుంచి మరుసటి రోజులు ఉదయం వరకూ దట్టంగా మంచు కురుస్తుండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది నెలకొంది. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న ప్రమాదాలు తప్పవు. గత ఏడాది డిసెంబర్‌లో కర్ణాటకలోని చిక్కబళాపురం వద్ద కమ్ముకున్న మంచు కారణంగా నిలిపి ఉన్న సిమెంట్ లారీని జీపు ఢీకొన్న ఘటనలో జిల్లాలోని గోరంట్ల, ఓడీసీ, కొత్తచెరువు, పెనుకొండ ప్రాంతాలకు చెందిన ఏడుగురు మృత్యువాతపడ్డారు. తాజాగా రెండు రోజుల క్రితం హిందూపురం–శిర మార్గంలో కమ్ముకున్న మంచు కారణంగా వాహనాన్ని నడపలేక రోడ్డు పక్కన ఆపిన క్యాంటర్‌ను ఆపి డ్రైవర్ నిద్రించాడు. అయితే ఈ విషయాన్ని గమనించని ద్విచక్రవాహనదారుడు నేరుగా వెళ్లి ఢీకొన్నాడు. అయితే తక్కువ వేగం కారణంగా ప్రాణాపాయం తప్పింది.

జాగ్రత్తలు తీసుకోవాలి..

మంచులో వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా రవాణాశాఖ అధికారులు సూచిస్తున్నారు. రాత్రి 11 నుంచి తెల్లవారుజాము 5 గంటల వరకు అత్యవసరమైతే తప్ప వాహనాలు నడపకపోవడమే మంచిదంటున్నారు. మంచు తీవ్రత ఎక్కువగా ఉన్న రాత్రి ఒంటి గంట నుంచి నాలుగు గంటల మధ్య వాహనాలు నడపరాదని హెచ్చరిస్తున్నారు. వాహనాలు నడిపే సమయంలో పార్కింగ్ లైట్లు వేయాలని సూచిస్తున్నారు.



పెనుకొండ: గొల్లపల్లి రిజర్వాయర్‌లో మంచు తెరలు తొలగుతున్న దృశ్యం



రొద్దం పరిసరాలను కప్పేసిన పొగ మంచు



రొద్దం మండల కేంద్రంలో చలి మంట వేసుకున్న స్థానికులు

కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

- న్యాయవాదుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరెడ్డి



పెనుకొండ: ఎన్నికలకు ముందు కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తామన్నారు. గెలిచిన అనంతరం కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న మోసపూరిత మాటలతో న్యాయవాదులు, సీమ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇలా చేస్తే చంద్రబాబు ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం తప్పక చెబుతారని న్యాయవాదుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసి పనులు ప్రారంభించగా కూటమి ప్రభుత్వం సైతం హైకోర్టు ఏర్పాటు చేస్తుందని భావించామన్నారు. అయితే అందుకు విరుద్ధంగా హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొనడం భావ్యం కాదన్నారు. హైకోర్టు కాకుండా బెంచ్ ఏర్పాటు చేస్తే మాత్రం ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పౌష్టికాహారం పంపిణీ



రోగులకు పౌష్టికాహారం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

హిందూపురం: హిందూపురం టీబీ యూనిట్‌లో కేర్ స్వచ్ఛంద సంస్థ టీబీ పేషెంట్స్‌కి పౌష్టికాహారం పంపిణీలు చేసింది. 30 మంది టీబీ పేషెంట్స్‌కు ఆర్గానిక్ బియ్యం ఒక్కొక్కరికీ 10 కేజీలు చొప్పున అందించారు. జిల్లా లెప్రసీ , ఎయిడ్స్ అండ్ టీబీ ఆఫీసర్ డాక్టర్ తిప్పయ్య హాజరై టీబీ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో పీపీఎం నాగేంద్ర , కేర్ ఎన్‌జీఓ కోఆర్డినేటర్ వెంకటేష్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ లత, సూపర్‌వైజర్ గౌస్, హెచ్‌వి పవిత్ర, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సీమలోనే హైకోర్టు ఏర్పాటు చేయాలి



నిరసన ర్యాలీ చేపట్టిన న్యాయవాదులు

పెనుకొండ రూరల్: హైకోర్టును రాయలసీమలోనే ఏర్పాటు చేయాలంటూ పెనుకొండ కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన తెలిపారు. కోర్టు ఆవరణం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నాగరాజు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం హైకోర్టు బెంచ్‌ను మాత్రమే కర్నూలులో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం సరికాదన్నారు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం కర్నూల్‌ను రాజధానిగా లేకపోతే హైకోర్టు ఏర్పాటు రెండింటిలో ఏదో ఒకటి కేటాయించాలన్నారు. అమరావతిలో హైకోర్టు ఏర్పాటు చేస్తే రాయలసీమకు అన్యాయం జరగతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు శివశర్మ, శ్రీనివాసులు, నాగార్జున, నాగిరెడ్డి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రాన్ని చదువుతున్న తహసీల్దార్ వరదరాజు

పావగడ: తాలూకా వ్యాప్తంగా ఉన్న సుమారు 600 మంది ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించి వారి కుటుంబాలను ఆదుకోవాలని జిల్లా ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు ప్రతాప్ మదకరి నాయక ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తాలూకా కార్యాలయం ఎదుట శుక్రవారం నిర్వహించిన ఆటో డ్రైవర్ల ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆటోలు పూర్తిగా ఎల్‌పీజీతోనే నడుస్తున్నాయని, అయితే ఎల్‌పీజీ ఆటో గ్యాస్ బంక్ లేకపోవడంతో అధిక ధరలు చెల్లించి వంట, వాణిజ్య గ్యాస్ సిలిండర్లపై ఆధార పడాల్సి వస్తోందన్నారు. వెంటనే పావగడ లో ఎల్‌పిజి ఆటో గ్యాస్ బంక్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. తాలూకా ఆటోడ్రైవర్ల సంఘం అధ్యక్షుడు బేకరి నాగరాజు, ఉపాధ్యక్షుడు బాష, కార్యదర్శి షమి, చిరంజీవి, బుగుడూరు రాజు, ఇస్మాయిల్ తదితర డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులు గుర్తించండి



మాట్లాడుతున్న ఏపీఓ ఓబుళప్ప

రొళ్ల: గ్రామాల్లో 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న ఉపాధి పనులకు సంబంధించి పనులను గ్రామసభ ద్వారా గుర్తించాలని ఏపీఓ ఓబుళప్ప పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రొళ్ల, దొడ్డేరి, ఎం.రాయాపురం, మల్లినమడుగు సచివాలయాల ఆవరణలో ఉపాధి పనుల గుర్తింపుపై ఆయా పంచాయతీ సర్పంచుల అధ్యక్షతన రైతులు, కూలీలతో కలిసి గ్రామసభను నిర్వహించారు. ఏపీఓ ఓబుళప్ప మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా శాశ్వత పనులు చేటప్టడం జరుగుతుందన్నారు. రైతులతో పాటు కూలీలకు ఉపయోగపడే విధంగా పనులు గుర్తించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జేఈ మారేగౌడు, టీఏలు, ఎఫ్ఏలు, రైతులు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

రెండ్రోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు

సాక్షిబృందం: ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెండ్రోజుల పాటు మండలంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయా మండలాల తహసీల్దార్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి పోలింగ్ బూత్ లెవెల్‌లో పరిధిలో శని, ఆదివారాల్లో బీఎల్‌ఓల ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఓటరు జాబితాలో పేర్ల నమోదు చేసుకోవచ్చని సూచించారు. అదేవిధంగా ఈకార్యక్రమం ద్వారా ఇప్పటికే ఉన్న ఓటరు జాబితాలో మార్పులకు చేర్పులకు అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. సవరణలకు ఫారం 6, 8 దరఖాస్తులను నింపి బీఎల్వోలకు సమర్పించాలన్నారు. చనిపోయిన వారిని ఓటరు జాబితా నుంచి తొలగించడానికి ఫారమ్ 7ను అందజేయాలన్నారు.

ఘనంగా కార్తీక పూజలు



సింగేపల్లిలో అలంకరణలో ఆంజనేయస్వామి



అలంకరణలో దుర్గాదేవి

మడకశిరరూరల్: మండలంలోని వివిధ ఆలయాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో శుక్రవారం కార్తీక పూజలు నిర్వహించారు. సింగేపల్లిలో ఆంజనేయస్వామికి ఆకుపూజ అలంకరణ చేసి పూజలు చేశారు. అదే విధంగా భక్తరపల్లి లక్ష్మీ నరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయ స్వామి, వీరకేతమ్మ, లక్ష్మీనిడిమామిడమ్మ, చెందకచెర్లు ఆంజనేయస్వామి, నీలకంఠేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు.

దుర్గాదేవి పూజలు

లేపాక్షి: మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయంలో వెలసిన దుర్గాదేవి అమ్మవారికి కార్తీక శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

కొల్లాపురమ్మ సేవలో ఈరలక్కప్ప



పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

అమరాపురం: మండలంలోని బుల్లేపల్లి గ్రామంలో వెలసిన కొల్లాపురి అమ్మ వారిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేయించారు. ఆయన వెంట సర్పంచ్ భాగ్యమ్మ, ఎంపీటీసీ సభ్యుడు నరసింహమూర్తి, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామసభకు 41 అర్జీలు

రొళ్ల: మండల పరిధిలోని హొట్టేబెట్ట సచివాలయం ఆవరణలో శుక్రవారం రెవెన్యూశాఖ అధికారులు భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభ నిర్వహించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి మాట్లాడుతూ హౌసింగ్, రేషన్ కార్డు మంజూరు, పింఛన్ల మంజూరు ఇతరాత్ర సమస్యలపై 41 అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ గిరియప్ప, మండల సర్వేయర్ కిరణ్‌కుమార్, వీఆర్వో నరసింహమూర్తి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తమలపాకు తెగులుపై అవగాహన

సాక్షి ఎఫెక్ట్..



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారులు

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో తమలపాకు తోటలకు ఆశించిన తెగుల నివారణపై రైతులకు ఉద్యాన శాఖాధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. 'తమలపాకు తెగుళ్లతో షాక్ '। అన్న శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రత్యేక కథనం వెలువడింది. దీనికి స్పందించిన ఉద్యాన శాఖాధికారులు మండలంలోని తమ్మడేపల్లి, దేవగానపల్లి నగోనపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన తమలపాకు తోటలను సందర్శించారు. తమలపాకుకు ఆశించిన తెగుళ్లను వారు పరిశీలించారు. తెగులును అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులను వివరించారు. సాక్షిలో వెలువడిన కథనంతోనే అధికారులు వచ్చి నివారణపై అవగాహన కల్పించారు, సాక్షికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారులు రమ్య, రాఘవేంద్ర, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



పరిగిలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

పరిగి: 'పరిసరాల పరిశుభ్రతతో పాటూ వ్యక్తిగత శుభ్రతను అందరూ పాటించాలి. ప్రధానంగా వ్యక్తిగత మరుగుదొడ్డిని అందరూ వినియోగించుకోవాలి' అని పరిగి సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంఈఓ లక్ష్మీదేవి తెలిపారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పరిగిలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బహిరంగ మల, మూత్ర, ప్రమాదకరమన్నారు. దీని వల్ల వ్యాధులు ప్రబలి ప్రజారోగ్యానికి ఇబ్బందికరంగా మారుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు నారాయణ, రంగనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రత్యూష, మల్లికార్జున, అంగనవాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కోసం నమోదు చేసుకోండి

అగళి: బోరు బావుల కింద రబీ సీజన్‌లో సాగు చేసేందుకు రైతులు విత్తన వేరుశనగ కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శేఖర్ నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రంలో రైతులు రిజిస్ట్రేషన్ చేయకోవాలని సూచించారు. వేరుశనగ కె-6 రకం 40 శాతం రాయితీతో 30 కేజీల బస్తా రూ.1728 అందజేస్తామన్నారు.

పంటలకు బీమా చెల్లించండి

గుడిబండ: రబీ సీజన్‌లో వివిధ పంటలు సాగుచేసుకున్న రైతులు ఈ క్రాప్‌లో నమోదు చేయించుకొని, పంటల బీమా రుసుం చెల్లించాలని మండల వ్యవసాయ అధికారి వీరనరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంక్ ద్వారా పంట రుణాలు పొందని రైతులు కామన్ సర్వీస్ సెంటర్, ఎన్‌సీపీఐ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా పంటల రుసుము చెల్లించవచ్చన్నారు. వేరుశనగ, టమాట పంటలకు డిసెంబర్ 15లోపు, వరి పంటకు డిసెంబర్ ఆఖరిలోపు సంబంధిత రుసుము చెల్లించాలన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లేపాక్షి: మండల కేంద్రంలోని 33/11 కేవి సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈ వెంకటేశులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చోళసముద్రం, బసవనపల్లి, నాయనిపల్లి, కుర్లపల్లి, లేపాక్షి, నవోదయ విద్యాలయం, కంచిసముద్రం , బింగిపల్లి ఫీడర్స్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

అమరాపురంలో...

అమరాపురం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సిద్దేశ్వర తెలిపారు. మండలంలోని హలుకూరు, మద్దనకుంట, అమరాపురం పంచాయతీలోని వినియోగదారులు గమనించాలన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

పావగడ: తమిళనాడులోని కృష్ణగిరి జిల్లాలోని ఓ కోర్టు వెలుపల ఓ న్యాయవాదిపై గుర్తు తెలియని నిందితుడు హత్యాయత్నం జరిపిన సంఘటనను నిరసిస్తూ స్థానిక జేఎంఎఫ్‌సీ కోర్టు న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించారు. న్యాయవాదిపై హత్యయత్నం సంఘటన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఈ నేపథ్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు.

మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించాలి

పావగడ: ఉచిత టైలరింగ్ ద్వారా శిక్షణ పొంది ఇతరుల మీద ఆధార పడకుండా మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా సాగాలని స్థానిక మాజీ ఎమ్మెల్యే కేఎం తిమ్మరాయప్ప మహిళలకు సూచించారు. తాలూకాలోని కేటీ హళ్లిలో శ్రీక్షేత్ర ధర్మస్థల గ్రామాభివృద్ధి యోజన ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జ్ఞాన వికాస కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం సంస్థ యోజనాధికారి మహేశ్ మాట్లాడుతూ తాలూకా వ్యాప్తంగా 25 జ్ఞాన వికాస కేంద్రాలను స్థాపించామని, 15 వందల మంది సభ్యులు చేరారన్నారు.

విత్తన వేరుశనగ పంపిణీ

మడకశిరరూరల్: రబీలో వేరుశన సాగుకు సిద్ధమైన రైతులకు శుక్రవారం మెళవాయి, హరేసముద్రం, జీవీపాళ్యం, మడకశిర రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేశారు. ఏఓ తిమ్మప్ప మాట్లాడుతూ విత్తన కాయలు తీసుకున్న రైతులు బోరు బావుల కింద వేరుశనగ పంటను సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మూర్తి, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్ లావణ్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని రైతు సేవా కేంద్రంలో రబీ సీజన్‌లో బోరు బావుల కింద వేరుశనగ పంటను సాగు చేసే రైతులకు శుక్రవారం మండల వ్యవసాయాధికారి మంజునాథ ఆధ్వర్యంలో విత్తనకాయలను పంపిణీ చేశారు. విత్తనకాయలు తీసుకున్న రైతులు వచ్చే నెల 15లోపు పంట సాగు చేయాలని సూచించారు.

నేడు చేపల చెరువు వేలం

గుడిబండ: మండల పరిధిలోని కొంకల్లు చెరువులో సంవత్సరం పాటు చేపల పెంపకానికి శనివారం వేలం వేయనున్నట్లు ఈఓఆర్డీ నాగరాజునాయక్, పంచాయతీ కార్యదర్శి హరీష్ తెలిపారు. ఉదయం 11 గంటలకు సచివాలయ ఆవరణలో వేలం పాట నిర్వహిస్తామన్నారు.